

ఆరోగ్య శ్రీ కొనసాగేనా..?

ఆరోగ్య శ్రీ సేవలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులు బంద్‌కు సిద్ధమవుతున్నాయి. - 8లో



ముగిసిన స్పోర్ట్స్‌మీట్

పాలిటెక్నిక్ స్పోర్ట్స్‌మీట్ ముగిసింది. క్రీడాకారులు రాణించారు. - 8లో

సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో లైఫ్ సర్టిఫికెట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా ప్రధాన ఖజానా కార్యాలయంతో పాటు జిల్లాలో అన్ని ఉప ఖజానా కార్యాలయాల్లోనూ ఏపీ ప్రభుత్వం పింఛన్‌దారుల లైఫ్ సర్టిఫికెట్లు తీసుకుంటారని, అందుకు పెన్షనర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు సహకారం అందిస్తున్నామని ఖజానా శాఖ డీడీ రవికుమార్ తెలిపారు. పింఛను దారులు నేరుగా వారి ఆండ్రాయిడ్ మొబైల్ ద్వారా, నెట్ సెంటర్లులోనూ లైఫ్ సర్టి ఫికెట్లు అందజేయవచ్చని ఆయన తెలిపారు.

న్యూస్‌రీల్

వృత్తి విద్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని రాష్ట్ర మహిళా సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌టీఆర్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో వృత్తి విద్యా శిక్షణలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజర్ పి.విమల తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత ఆధారంగా అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్టు, 8వ తరగతి అర్హతగా టైలరింగ్ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణకు 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 9948530 183, 74167 64419 లను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ డీఐజీగా తుంగతంపర వాసి



చింతం వెంకటప్పలనాయుడు

హిరమండలం: తుంగతంపర గ్రామానికి చెందిన చింతం వెంకటప్పలనాయుడు డీఐజీగా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణలోని శంషాబాద్ ఎయిర్ పోర్టు డీఐజీగా నియమితులయ్యారు. ఎయిర్‌పోర్టు ఇంటెలిజెన్స్ (ఎస్పీగా) ఎయిర్‌పోర్టు భద్రతాధికారిగా వ్యవహరించనున్నారు. వెంకటప్పలనాయుడు ఎంపికపై తుంగతంపర గ్రామపెద్దలు, యువకులు, మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలుపుతున్నారు.

మందసలో ప్రకృతి వ్యవసాయం స్టేట్ టీమ్ పర్యటన



సీడ్ ప్లాట్ పరిశీలిస్తున్న స్టేట్ టీమ్ ప్రకాష్, హేమసుందర్

కాశీబుగ్గ: మందస మండలంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ యూనిట్‌లను రాష్ట్ర స్థాయి బృందం గురువారం సందర్శించింది. స్టేట్ టీమ్ నుంచి వచ్చిన వారిలో ప్రకృతి వ్యవసాయం రీజనల్ కో ఆర్డినేటర్‌లు ప్రకాష్, హేమసుందర్‌లు ఉన్నారు. మందస మండలం రాయకోల గిరిజన గ్రామం పంటపొలంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సీడ్ ప్లాట్ పరిశీలించారు. సుమారు ఒక ఎకరా పొలంలో సీడ్ ప్లాట్ వేయించగా ఈ పంటలో వచ్చే విత్తనాలు ఖరీఫ్ సీజన్లో పీఎండీఎస్ విత్తనాలు కోసం ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో డీపీఎం మేడం రేవతి, అడిషనల్ డీపీఎం ధనుంజయ, ఎన్ఎఫ్ఏలు గోవిందరెడ్డి, ముసలయ్య, ఎంటి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'మైక్రో ఫైనాన్స్ వలలో పడితే అప్పులే'

కాశీబుగ్గ: గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులు మైక్రో ఫైనాన్స్ సంస్థల వలలో పడి అప్పులు పాలు కావద్దని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. గురువారం కొండలోగాం, కుసుమల పంచాయతీల్లో పర్యటిస్తూ టంగరపుట్టి గ్రామంలో ఏర్పాటు చేసిన మహిళా సంఘాల అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మహిళా సంఘాల స్థితి గతులు తెలుసుకొని కొద్దిమంది సభ్యులు వారి అత్యవసరాల మేరకు మైక్రో ఫైనాన్స్ సంస్థల బారిన పడి అధిక వడ్డీలు చెల్లిస్తున్న విషయం తెలుసుకొని పని చేస్తున్న సిబ్బందిపై విరుచుకుపడ్డారు. గతంలో బ్యాంకులు నిరాకరించడం వల్లే మైక్రో ఫైనాన్స్ సంస్థలు గ్రామాల్లో అప్పులు ఇస్తున్నాయని సిబ్బంది చెప్పారు. దీంతో ఆయన అక్కడి నుంచే బ్యాంకు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సంఘం సేవింగ్స్ ఖాతాలో లక్షల కొద్దీ నిధులు ఉన్నా బ్యాంకుల సహకారం లేనందున మైక్రో ఫైనాన్స్ సంస్థల విచ్చల విడితనం పెరిగిపోయిందన్నారు. మందస మండలంలో ప్రస్తుతం అన్ని బ్యాంకులు కూడా అంతర్గత అప్పులకు అవకాశం కల్పిస్తున్నందున సభ్యురాలి అవసరాల మేరకు గ్రూపు తీర్మానం చేసి అప్పులు ఇప్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, క్లస్టర్ కో–ఆర్డినేటర్ స్వామి నాయుడు, వీఓఏలు జగబంధు, ఆనంద్‌తో పాటు వనదన్ వికాస కేంద్ర సభ్యులు, గ్రామ సంఘాలు ప్రజాలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం పైడి కూర్మారావు

గర్భగుడిపై కత్తిగాటు



ఒకప్పుడు ప్రసవం అయ్యాక.. డెలివరీ సమయం రాసుకుని నక్షత్రం, రాశి తెలుసుకునేవారు. కానీ ఇప్పుడు ముందే ఓ ముహూర్తం నిశ్చయించుకుని దాని ప్రకారం సిజేరియన్లు చేసేస్తున్నారు. సాధారణ ప్రసవం అసాధారణ విషయంగా మారిపోయింది. కడుపుపై కత్తిగాటు పడనిదే జిల్లాలో సగం మంది గర్భిణులకు డెలివరీ కావడం లేదు. ప్రైవేటు ఆస్పత్రులు పెరగడం, సాధారణ కాన్పుల వల్ల వచ్చే ప్రయోజనాలపై అవగాహన లేకపోవడంతో ఆపరేషన్ల వైపు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. ఇది బాలింతల దీర్ఘకాల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. నరసన్నపేట ప్రభుత్వాస్పత్రిలో పదకొండు నెలల కాలంలో 945 ప్రసవాలు జరిగితే అందులో 606 ఆపరేషన్లే కావడం గమనార్హం.



సుఖ ప్రసవానికే ప్రాధాన్యత ఇస్తున్నాం



ఆస్పత్రికి వచ్చే వారిని సాధారణ ప్రసవాల కోసం ప్రోత్సహిస్తున్నాం. వారికి అన్ని విధాలా అవగాహన కలిగిస్తున్నాం. అయినా కొంత మంది వినడం లేదు. తల్లిదండ్రులు భయపడి ఆపరేషన్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో మేమూ అంగీకరించి సంతకాలు తీసుకొని ఆపరేషన్లు చేస్తున్నాం. కొందరు అయితే ముందుగానే పండితులచే ముహూర్తాలు కట్టించుకొని వస్తున్నారు. వాస్తవానికి సుఖ ప్రసవం అయితే మంచిది.

– జయశ్రీ, స్త్రీ వైద్య నిపుణులు, నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి

- తగ్గుతున్న సాధారణ ప్రసవాలు
- పెరుగుతున్న సిజేరియన్లు
- ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే సిజేరియనే
- నరసన్నపేట ఆస్పత్రిలో 11 నెలల్లో 606 ఆపరేషన్లు, సాధారణ ప్రసవాలు 339

నరసన్నపేట: సాధారణ ప్రసవం ఇప్పుడు అసాధారణంగా మారిపోయింది. డాక్టర్లు ఓపిక పట్టాలని సూచించినా.. అంత ఓర్పుగా ఉండడం నేటి తరం గర్భిణులకు వీలు కావడం లేదు. దీనికి తోడు తల్లిదండ్రులు కూడా బిడ్డకు నచ్చజెప్పకుండా ఆపరేషన్లకే ఒత్తిడి చేస్తున్నారు. ఏకంగా ముహూర్తం పెట్టుకుని వచ్చి ఆ సమయానికి సిజేరియన్ చేయాలని సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సంప్రదాయం ఇప్పుడు కనిపిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొంత వరకూ సాధారణ ప్రసవాలు జరుగుతున్నా ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవం అంటేనే ఆశ్చర్యంగా చూసే పరిస్థితి ఉంది. నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో జనవరి నుంచి నవంబర్ వరకూ 945 ప్రసవాలు జరగ్గా శస్త్ర చికిత్సలు 606 ఉన్నాయి. సాధారణ ప్రసవాలు కేవలం 339 మాత్రమే జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది.

ఆపరేషన్ ఎప్పుడు అవసరం..?

వాస్తవానికి తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ చేయాలి. బిడ్డ అడ్డం తిరిగినప్పుడు, గర్భిణీ నీరసంగా ఉన్నప్పుడు, ఉమ్మినీరు పోయినప్పుడు ఇతర అత్యవసర స్థితుల్లోనే ఆపరేషన్ గతంలో చేసేవారు. ఇప్పుడు అవసరం ఉన్నా లేకపోయినా కట్టు కోత అనివార్యమవుతోంది. కత్తి గాటు పడనిదే బిడ్డ బయటకు రావడం లేదు. సహజ కాన్పుల వేదన తప్పించుకోవడానికి గర్భిణులు ఆపరేషన్లకు సిద్ధపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం సాధారణ ప్రసవాలపై అవగాహన లేకపోవడం.

ఇదీ వ్యాపారమే..

ప్రైవేటు ఆస్పత్రుల్లో అచ్చంగా డెలివరీలు వ్యాపారం మాదిరిగానే జరుగుతున్నాయి. నరసన్నపేట లాంటి పట్టణాల్లోనే ఆపరేషన్‌కు రూ. 30 వేల నుంచి రూ. 50 వేల వరకూ తీసుకుంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఇతర కార్పోరేట్ ఆస్పత్రుల్లో అయితే రూ. 50 వేల నుంచి రూ. లక్ష అవుతుంది. అంటే ఒక మేజరు ఆపరేషన్‌కు తీసుకున్నంత మొత్తం చార్జ్ చేస్తున్నారు. నరసన్నపేటలో అయితే సరాసరిన రోజుకు 15 నుంచి 20 వరకూ ప్రసవాలు అవుతున్నాయి. శ్రీకాకుళంతో పాటు ఇతర పట్టణాల్లో గమనిస్తే ఈ సంఖ్య మరింత అధికంగా ఉంటుంది. వంద నుంచి మూడు వందల వరకూ ప్రసవాలు అవుతున్నట్లు అంచనా. వీటిలో 80 శాతం ఆపరేషన్లే అవుతున్నాయి. సిజేరియన్ చేస్తేనే ఆస్పత్రుల్లో కనీసం ఐదు రోజుల నుంచి వారం వరకూ ఉంచవచ్చు. దీంతో ఎంత వీలైతే అంత మొత్తంలో బిల్లు చేసుకోవచ్చు అని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు చూస్తున్నాయి.

ఆపరేషన్ ప్రసవాలతో ఇబ్బందులు..



- సహజ ప్రసవ సమయంలో హార్మోన్లు విడుదల కావడం వల్ల బాలింతలో సహజంగానే చనుబాలు ఉత్పత్తి అవుతాయి. అదే ఆపరేషన్ అయితే పిల్లల పుట్టిన వెంటనే పాలు ఇవ్వడం కష్టమవుతుంది.
- ముర్రుపాలు ఇవ్వక పోతే అది బిడ్డ ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది.
- సిజేరియన్ సమయంలో గర్భిణీ మూత్రనాళానికి, పేగులకు గాయాలయ్యే అవకాశం ఉంటుంది.
- శస్త్ర చికిత్స జరిగితే నొప్పితో బాలింత వారాల తరబడి మంచానికి పరిమితం కావాల్సి వస్తుంది.
- కదలికలు తక్కువ కావడం వల్ల హెర్నియా వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
- పీరియడ్స్ సమయంలో అధిక రక్త స్రావం వంటివి చోటు చేసుకొనే ప్రమాదం ఉంటుంది.

కారణాలు అనేకం..

- ఆహారపు అలవాట్లలో మార్పు రావడం, వ్యాయామ లేమి, బయట తిళ్లు ఎక్కువగా తీసుకోవడం వంటివి గర్భిణుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి.
- రక్తపోటు, చక్కెర శాతం పెరగడం, థైరాయిడ్ వంటి అనారోగ్య ఇబ్బందులు వస్తున్నాయి. ఇలాంటి లక్షణాలు ఉండే మహిళలకు సిజేరియన్ చేస్తున్నారు.



వార్డులో ఉన్న బాలింతలు

డీఎంహెచ్‌ఓ బాధ్యతల స్వీకరణ

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిగా డాక్టర్ టీవీ బాలమురళీ కృష్ణ గురువారం కొత్తగా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకుని అనంతరం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అధికార సిబ్బంది నడుమ బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు నిర్వర్తించిన బి.మీనాక్షికి విశాఖపట్నం బదిలీ చేసిన సంగతి విదితమే. దీంతో కొత్తగా బాలమురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించడంతో స్థానిక వైద్యాధికారులు అభినందనలు తెలియజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మేరి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రకాశరావు, కార్యాలయ ఏఓ బాబూరావు, సూపరింటెండెంట్ భాస్కరకుమార్ తదితరులు ఆయన్ను కలిసి పూల మాలలతో సత్కరించి ఆహ్వానించారు.



డీఎంహెచ్‌ఓ బాలమురళీకృష్ణను అభినందిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

సనపల సురేష్‌కుమార్‌కు పోలీసు నోటీసు

బూర్జ: మండలంలో గల గుత్తావల్లి గ్రామానికి చెందిన సనపల సురేష్‌కుమార్‌కు స్థానిక బూర్జ పోలీస్‌స్టేషన్ నుంచి సిబ్బంది గురువారం నోటీసు అందజేశారు. సోషల్ మీడియా యాక్ట్ ప్రకారం ఆయనపై వచ్చిన ఫిర్యాదుపై బూర్జ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విచారణ కోసం ఆమదాలవలస పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి హాజరు కావాలని పోలీసులు నోట్ ద్వారా తెలియజేశారు.

6 వరకు వినతుల స్వీకరణ

శ్రీకాకుళం: శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో 38 ఔట్ సోర్సింగ్, 2 కాంట్రాక్ట్ ఉద్యోగాలు భర్తీకి సంబంధించి గతంలో నోటిఫికేషన్ జారీ చేశారు. దానికి సంబంధించిన ప్రాథమిక మెరిట్ లిస్ట్ గురువారం శ్రీకాకుళం వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం 4గంటల వరకు దీనికి సంబంధించిన వినతులు స్వీకరిస్తామని వైద్యశాఖ అధికారులు తెలిపారు.

జగనన్న లే అవుట్ ఆక్రమణ

- టీడీపీ నాయకుడి ఘన కార్యం
- సరిహద్దు రాళ్లు తొలగించి కంచె ఏర్పాటు
- కన్నెత్తి చూడని రెవెన్యూ అధికారులు



ఉమిలాడలో జగనన్న లేఅవుట్ ఆక్రమించి మొక్కలు నాటి కంచె ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకుల అరాచకానికి హద్దు లేకుండా పోయింది. పేదలకు కేటాయించిన జగనన్న కాలనీపై కన్నేసిన ఘటన ఉమిలాడ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఉమిలాడ గ్రామంలో 2020 సంవత్సరంలో సర్వే నంబర్ 185లో ఎకరా పైబడి ప్రభుత్వ భూమిని జగనన్న లేఅవుట్‌కు రెవెన్యూ అధికారులు కేటాయించారు.ఈ స్థలంలో ఉపాధి హామీ పథకం నిధులతో లేఅవుట్ ఎత్తుచేసి గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. తయారైన జగనన్న లేఅవుట్‌లో 22 మంది లబ్ధిదారులు ఇల్లు స్థలాలను కేటాయించి సరిహద్దులను ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేయడానికి సిద్ధమయ్యారు. కానీ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బొంది పాపారావు ఆ స్థలం తన ఆధీనంలో ఉందంటూ కోర్టును ఆశ్రయించారు. దీంతో పేదలకు పట్టాలు ఇవ్వడం కుదరలేదు. ఆ స్థలం ప్రభుత్వ భూమి అని అప్పటి తహసీల్దార్ చలమయ్య కోర్టుకు విన్నవించారు. కోర్టు తీర్పు వచ్చిన తర్వాత నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులు నిర్ణయించుకున్నారు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నాయకులు ఆక్రమణ పనిని మొదలుపెట్టారు. కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని జగనన్న లేఅవుట్‌లో వేసిన సరిహద్దు రాళ్లను టీడీపీ నాయకుడు బొంది పాపారావు తొలగించి ఆక్రమించుకున్నారు. జగనన్న లేఅవుట్ చుట్టూ కంచెను ఏర్పాటు చేసి మొక్కలను నాటారు. ఇప్పుడు ఇళ్ల స్థలాలుగా చేసి అమ్మేందుకు బేరసారాలు చేస్తున్నారని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు

ఉమిలాడలో ప్రభుత్వ భూమిలో వేసిన జగనన్న లేఅవుట్ ఆక్రమణకు గురైన విషయం నా దృష్టికి రాలేదు. స్థానిక వీఆర్వో, ఇతర సిబ్బందికి అడిగి తెలుసుకుంటాను. దీనిపై ఎవరైనా ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటాం.

– హరిబాబు, డిప్యూటీ తహసీల్దార్, సంతబొమ్మాళి

నిరుపేద కుటుంబంపై ప్రతాపం

- జగనన్న కాలనీలో జియోట్యాగింగ్ లేదని పునాదులు తొలగించే ప్రయత్నం
- కోటబొమ్మాళి మండలం యలమంచిలి పంచాయతీలో సంఘటన
- అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, గ్రామస్తులు



మామిడివానిపేట గ్రామంలో ఇంటి పునాదులు జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

టెక్కలి: తమ ప్రభుత్వంలో ఎలాంటి కక్ష సాధింపు చర్యలు లేవని మంత్రి కె.అచ్చెన్నాయుడు పలు బహిరంగ సభల్లో ప్రసంగాలు చేస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితులు దానికి భిన్నంగా కనిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే అక్కసుతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు చేస్తున్న కక్ష సాధింపు చర్యలకు అదుపు లేకుండా పోతోంది. తాజాగా గురువారం కోటబొమ్మాళి మండలం యలమంచిలి పంచాయతీ మామిడివానిపేట గ్రామంలో జగనన్న కాలనీలో వీరఘట్టపు రజని కుటుంబానికి చెందిన ఇంటి పునాదులను తొలగించే ప్రయత్నం చేశారు. జియోట్యాగింగ్ చేయలేదనే సాకుతో రెవెన్యూ అధికారులు కూల్చివేసే ప్రయత్నాలు చేశారు. దీంతో పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.రామరాజు, ఎంపీటీసీ హెచ్.గోవిందరావు, గ్రామస్తులు ఎస్.అప్పన్నతో పాటు మరి కొంత మంది నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి పునాదుల కూల్చివేతను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సుమారు 43 మందికి ఇంటి స్థలాలు ఇచ్చారని వారిలో వీరఘట్టపు రజని కుటుంబానికి స్థలంతో పాటు ఇంటి పట్టాను అప్పటి అధికారులు అందజేశారని వెల్లడించారు. రజని భర్త భాస్కరరావు టీడీపీకి వేటు వేయలేదని కక్ష పెట్టుకుని కొందరు ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు అధికారులను ఉసిగొల్పారని మండిపడ్డారు. గ్రామాల్లో సామాన్య ప్రజలపై ఈ విధంగా టీడీపీ కార్యకర్తలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. 2014–19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో తమ పంచాయతీలో అన్యాయంగా సుమారు 80 మంది వృద్ధుల పింఛన్లు తొలగించారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో టీడీపీ వర్గానికి చెందినవారందరికీ సంక్షేమ పథకాలు అందజేశారని, కానీ ఇప్పుడు అధికార పక్షం వారు నిరుపేదలపై ప్రతాపం చూపిస్తున్నారని మండిపడ్డారు. కక్ష సాధింపు చర్యలను మానుకోకపోతే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.



తొలగించిన ఇంటి పునాదులను చూపుతున్న బాధితురాలు రజని ఆమె భర్త భాస్కరరావు తదితరులు



తడిచిన వరి కుప్పలను చూపిస్తున్న చిన్నారావు

అన్నదాత కంటతడి

- ముక్కిపోయిన పంటను చూసి విలపించిన రైతన్న
- అధికారుల నిర్వాకమే కారణమని ఆవేదన



తడిచి ముక్కు పట్టిన వరి పనాలు

నరసన్నపేట: అల్పపీడనం, వాయుగుండం కారణంగా పది రోజులపాటు కొనసాగిన ముసురు వాతావరణం రైతులకు తీరని నష్టం మిగిల్చింది. ఆలస్యంగా ఉభాలు చేసిన రైతులు ఈ ముసురుకు దొరికిపోయారు. అధికారులు మాటలు నమ్మి కోతలు కోయకుండా ఉన్న వారంతా బాగా నష్టపోయారు. నిరంతరాయంగా కురిసిన చినుకులకు పొలాల్లో ఉన్న వరి కుప్పలు తడిచి ముద్దయ్యాయి. వాతావరణం మారిన తర్వాత పొలాల్లోకి వెళ్లిన వరి కుప్పలు పరిశీలించిన రైతులు గుండెలు బాదుకుంటున్నారు. పాడైన, కోయని వరి పొలాలను పరిగణనలోనికి తీసుకోని వ్యవసాయ అధికారులు.. ఈ కుప్పలు గురించి అసలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నరసన్నపేట మండలంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. వాతావరణం చక్కబడిన తరువాత నూర్పు చేసుకోవచ్చని ఆశించిన రైతులు పొలాల్లోనే కుప్పలు పెట్టారు. ఇప్పుడవి కూడా వర్షానికి తడిచి ముద్దయ్యాయి. జగన్నాథపురానికి చెందిన పట్నాన చిన్నారావు తడిచిన వరి కుప్పలు చూసి బుధవారం కంటతడి పెట్టారు. తడిచి పోయి ధాన్యం మొలకలు వస్తుండటంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంచి ధర పలుకుతుందని సాంబ రకం పండించానని, ఇప్పుడు వర్షానికి తడిచిపోయిందని, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. వర్షాలకు నష్టాలను నమోదు చేశారా.. అని స్థానిక వ్యవసాయశాఖ ఏడీ రవీంద్ర భారతి వద్ద ప్రస్తావించగా నరసన్నపేట ప్రాంతంలో ఎటువంటి నష్టం జరగలేదని, గుర్తించలేదని చెప్పడం గమనార్హం.

జాతీయ స్కూల్‌గేమ్స్ క్రికెట్ పోటీలకు జ్యోస్మిత్



జ్యోస్మిత్

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ క్రికెట్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి తుంగాన జ్యోస్మిత్ ఎంపికయ్యాడు. ఢిల్లీలో వేదికగా జరగనున్న ఆలిండియా స్కూల్గ్స్ అండర్–14 బాలుర క్రికెట్ చాంపియన్‌షిప్–2024–25 పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున జ్యోస్మిత్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం వేదికగా గత నెల డిసెంబర్ 28 నుంచి 30వరకు జరిగిన 68వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ క్రికెట్ పోటీల్లో ఈ సిక్కోలు ఆశాకిరణం మెరుగ్గా రాణించడంతో జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని అందిపుచ్చుకున్నాడు. శ్రీకాకుళం నగరంలోని ఆర్‌సీఎం సెయింట్ జాన్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జ్యోస్మిత్ జాతీయ పోటీల్లో రాణించేందుకు కఠోర సాధన చేస్తున్నాడు. తండ్రి తుంగాన ఆనంద్ సత్యవరం(నరసన్నపేట మండలం) జెడ్పీహెచ్‌స్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తుండగా, తల్లి సునీత గృహిణి.



తల్లిదండ్రులతో తుంగాన జ్యోస్మిత్ (కుడివైపు)

నేడు జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనల ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ తిరుమల చైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో శుక్రవారం జరగనున్న జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య కోరారు. నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి ఈ సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభంకానుందని ఆయన చెప్పారు. ఈ మేరకు సైన్స్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన ఏర్పాట్లను గురువారం రాత్రి ఆయన పరిశీలించారు. ప్రధాన వేదికతోపాటు మండలాల నుంచి రానున్న ప్రదర్శనల గురించి ఆరా తీశారు. ఏక విద్యార్థి, విద్యార్థుల సమూహం, టీచర్ కాన్సెప్ట్ మూడు కేటగిరిల్లో డిసెంబర్ 30వ తేదీన మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు జరిగిన విషయం తెలిసిందే. ఈ పోటీల్లో మూడు కేటగిరీల్లో విజేతలుగా నిలిచినవారు జిల్లాస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని కార్యక్రమ నోడల్ అధికారి, శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమార్ తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్.కుమారస్వామి ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తోపాటు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు డీఈఓ తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

టెక్కలి రూరల్: స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ సమీపంలో అయ్యప్పనగర్‌కు వెళ్లే దారిలో గురువారం దుంపల గొడౌన్‌కు అన్‌లోడ్ చేసేందుకు వచ్చిన లారీ వెనుక్కు వస్తూ అక్కడే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఒక్కసారిగా స్తంభం రెండు ముక్కలు కావడంతో విద్యుత్ వైర్లు కిందకు వాలిపోయాయి. ఆ సమయంలో కింద ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది వెంటనే మరమ్మతులు చేయించారు.

బడ్డీ దగ్ధం


కాలిపోతున్న బడ్డీ

టెక్కలి రూరల్: స్థానిక పాత జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంకు సమీపంలో పాడుబడిన ఖాళీ బడ్డీలో గురువారం ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో మంటలు చెలరేగాయని స్థానికులు చెబుతున్నారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీఓ

సోంపేట: మండలంలోని బారువ, లక్కవరం, పలాసపురం, కొర్లాం పంచాయతీల పరిధిలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పలాస ఆర్డీఓ జి.వెంకటేశ్ గురువారం స్థల పరిశీలన చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలు ఆత్మహత్య


పైడి వరహాలమ్మ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుశాలపురం గ్రామానికి చెందిన పైడి వరహాలమ్మ (66) బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల తో బుధవారం మధ్యాహ్నం వర కు గడిపిన వరహాలమ్మ రాత్రి కనిపించకపోవటంతో కుమారు లు చంద్రరావు, అమ్మినాయుడు, మురళీ చుట్టపక్కల ప్రాంతాల్లో వెతికారు. గురువారం ఉదయం సైతం ఆచూకీ కోసం ప్రయత్నించారు. కుశాలపురంలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న బావిలో మృతదేహం తేలడంతో స్థానికులు గుర్తించారు. ఆ మృతదేహం తమ తల్లిదేనని కుమారుడు చంద్రరావు గుర్తించి ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో సివిల్ భూ వివాదం కారణంగా తన తల్లి బలవన్మరణానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ క్లీనర్ మృత్యువాత


మృతి చెందిన జుబీర్ అన్సారీ

రణస్థలం: మండలంలో ని పైడిభీమవరం సమీపంలో వరిసాం వద్ద లారీ క్లీనర్ జుబీర్ అన్సారీ (23) అకస్మాత్తుగా కుప్పకూలి చనిపోయాడు. జె.ఆర్.పు రం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరియర్ ట్రాన్స్‌పోర్టు లారీ జంషెడ్‌పూర్ నుంచి బెంగళూరు బయలుదేరింది. గురువారం వేకువజామున 3 గంటల సమయంలో డ్రైవర్ శ్యాంసుందర్, క్లీనర్ జుబీ ర్ అన్సారీ వరిసాం వద్ద సాహు దాబా వద్ద లారీ ఆపి టీ తాగేందుకు లోపలకు వెళ్లారు. అరగంట తరువాత క్లీనర్ లారీ డ్రైవ్ చేసేందు కు స్టీరింగ్ ముందు కూర్చొన్నాడు. వెనువెంటనే స్టీరింగ్‌పై కుప్పకూలి మృతి చెందాడు. ఇతను ఆరోగ్యంతో బాధపడుతూ మందులు కూడా వాడుతున్నారు. మృతుడు జార్కండ్ రాష్ట్రం చత్ర జిల్లాకు చెందినవాడు. విషయం తెలుసుకున్న జె.ఆర్.పురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు శవపంచనామాకు తరలించారు. ఎస్సై ఎస్ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడో రోజు 214 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు గురువారం కూడా కొనసాగాయి. మూడో రోజు పరీక్షలకు 613 మందికి గాను 339 మంది హాజరు కాగా 214 మంది తుది రాత పరీక్షకు హాజరయ్యారు. ఈ నెల 18 వరకు ఎంపిక పరీక్షలు కొనసాగనున్నాయి.

ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగేనా?

- బకాయిలు రూ.75 కోట్ల పైమాటే...
- ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా మారుతున్న వైనం
- ఆందోళన దిశగా ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు
- ఈ నెల 6 నుంచి సేవల బంద్‌కు సమాయత్తం


జిల్లా కేంద్రంలో ఓ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ వార్డు

అరసవల్లి:

పేదల ఆరోగ్య సంజీవని ఆరోగ్యశ్రీ పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. పేదలకు ఉచిత వైద్యం అందించే లక్ష్యంగా ఎలాంటి ఆర్థిక భారం లేకుండా శస్త్రచికిత్సలు చేసేందుకు ఉద్దేశించిన ఈ పథకం..ఇప్పుడు నీరుగారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఎంతో ప్రయోజనాత్మంగా అమలైన సంగతి విదితమే. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీగా పేరు మార్చినా నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక పేదల వైద్యంపై టార్గెట్ చేసి ఇప్పుడు ఏకంగా ఉచిత వైద్య పథకానికి గండికొట్టేలా చర్యలకు ఉపక్రమించారు. గత ప్రభుత్వంలో ఉన్న కొద్దిపాటి బకాయిలతో పాటు తాజా ప్రభుత్వంలో కూడా కోట్లాది రూపాయల బకాయిలు ప్రైవేటు ఆసుపత్రులకు చెల్లించకపోవడంతో ఆయా యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ సేవలకు బంద్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

బకాయిలు చెల్లించేదెన్నడో?

జిల్లాలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పేరిట పేదలకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేసేందుకు మొత్తం 17 ప్రభుత్వ, 13 ప్రైవేటు ఆసుపత్రులను నెట్‌వర్క్ ఆసుపత్రులను గుర్తించారు. ఆరోగ్యశ్రీ పేరిట రోగులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేసి, ఆయా సంబంధిత ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సిఉంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి హయాం నుంచి ఇదే విధానం అమలౌతూనే ఉంది. గత ప్రభుత్వం వరకు ఆరోగ్యశ్రీలో వందలాది జబ్బులను చేర్చడమే కాకుండా ఎప్పటికప్పుడు ఆయా ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఖర్చుల చెల్లింపులు జరిగేవి. గత ప్రభుత్వం చివర్లో, ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత చెల్లింపులు ఆగిపోయాయి. వీటితో కలిపి ఇప్పటివరకు జిల్లాలో 13 ప్రైవేటు ఆసుపత్రులకు సుమారుగా రూ.75.24 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వాలతో పోల్చితే... కూటమి ప్రభుత్వం వచ్చాకే బకాయిలు ఎక్కువయ్యాయి. దీనిపై పలుమార్లు ప్రైవేటు ఆసుపత్రుల సంఘ ప్రతినిధులు నివేదిస్తున్నా సర్కారు పట్టించుకోవడం లేదు. దీంతో ఆస్పత్రుల నిర్వహణ ఆయా యాజమాన్యాలకు భారంగా మారింది.

6 తర్వాత సేవల బంద్..!

కోట్లాది రూపాయలు బకాయిలుండడంతో ఆసుపత్రుల యాజమాన్యాలు తీవ్ర ఆందోళనలో ఉండటంతో పాటు ఉద్యమబాట పట్టనున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు రూ.3 వేల కోట్ల వరకు బకాయిలు చేరడంతో యాజమాన్యాల పరిస్థితి అయోమయంగా తయారయ్యింది. ఎన్నిసార్లు విన్నవిస్తు న్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 6 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు కూడా జారీ చేసినట్లు యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇదిలావుంటే ప్రస్తుతానికి ఆరోగ్యశ్రీ సేవలు ఎక్కడా నిలిపివేయకపోయినప్పటికీ...మరికొద్ది రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే కచ్చితంగా ఈ నెల 6 నుంచే ఆరోగ్యశ్రీ సేవలన్నీ ప్రైవేటు ఆసుపత్రుల్లో బంద్ కానున్నాయి.

సేవలు కొనసాగుతున్నాయి...



ప్రస్తుతానికి జిల్లాలో 30 నెట్‌వర్క్ ఆసుపత్రులున్నాయి. ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగుతున్నాయి. మొత్తం 3257 రకాల జబ్బులను ఆరోగ్యశ్రీ జాబితాలో ఉన్నాయి. వీటికి సంబంధించిన రోగులకు ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి.

– డాక్టర్ ప్రకాషరావు, జిల్లా కో–ఆర్డినేటర్, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ

అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ పెరగాలి

- విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు
- అధికారుల సమీక్షలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రాజెక్టుల పనితీరుపై ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శాంతిశ్రీ, సంబంధిత సీడీపీఓలతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో పాలు, గుడ్లు పంపిణీ జరగాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, పిల్లలలో పోషకాహార లోపం లేకుండా చూడాలన్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో గ్రామీణ నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమన్వయంగా వ్యవహరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు తప్పనిసరిగా చేపట్టాలని, ఈ విషయంలో వెనకబడ్డ సీడీపీఓలు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టేందుకు గ్రామ, మండల స్థాయిలలో నిర్వహించబోయే సమావేశాలు అవగాహన కార్యక్రమాల ప్రణాళికను సిద్ధం చేసి తనకు అందజేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన సాక్ష్యం అంగన్‌వాడీ కేంద్రాలలో ఇంకుడు గుంతలు, ఇతర సామగ్రి పంపిణీ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సీడీపీఓ, సూపర్‌వైజర్లు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించి నిర్లక్ష్యంగా కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. టి.హెచ్.ఆర్ శతశాతం లబ్ధిదారులకు అందాలని, మాతా, శిశు మరణాల నియంత్రణ దిశగా పని చేయాలని సూచించారు.

రథసప్తమికి ‘సిక్కోలు చిహ్నాలు’


పొట్టి శ్రీరాములు కూడలిని పరిశీలిస్తున్న జేసీ, అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రథసప్తమిని రాష్ట్ర పండుగగా గుర్తించిన నేపథ్యంలో ఉత్సవం నాటికి జిల్లా కేంద్రంలోని కళింగరోడ్డు, పొట్టిశ్రీరాములు కూడలి, అరవసల్లి రోడ్డు, మిల్లు జంక్షన్, నగర ప్రవేశ ద్వారాల వద్ద సిక్కోలు చిహ్నాలు ప్రతిబింబించేలా సుందర ఆకృతులు ఏర్పాటు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. గురువారం శ్రీకాకుళం నగరంలో పలు ప్రాంతాలను కార్పొరేషన్ అధికారులతో కలిసి జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథసప్తమి వేడుకల నాటికి నగరమంతా అందంగా కనిపించేలా తయారు చేస్తామన్నారు. ఇందుకు సుడా, మున్సిపల్ శాఖ అధికారులు చొరవచూపాలన్నారు. డీపీఆర్ తయారుచేసి త్వరితగతిన పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ సుగుణాకరరావు, సుడా ఏపిఓ కృష్ణారావు, టీపీఓ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 7న కమ్మసిగడాం జాతర


ఆలయం వద్ద సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి జాతర ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. కమ్మసిగడాంలోని మహాలక్ష్మీతల్లి అమ్మవారి కల్యాణ మండపంలో జాతర ఏర్పాట్లపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర సక్రమంగా జరిపేందుకు కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. అనంతరం బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెలిచేటి రామకృష్ణ, వి.రాజరవిచంద్ర, వి.తేజ పాల్గొన్నారు.

అప్పుల ఊబిలోకి రాష్ట్రం

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్


మాట్లాడతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానంటూ నమ్మబలికి ఓట్లు దండుకున్న సీఎం చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.లక్ష కోట్లు అప్పుచేశారని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆరోపించారు. ఆమదాలవలస పట్టణంలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు తాజాగా ఏపీఎండీసీ ద్వారా రూ.5 వేల కోట్లు అప్పు చేయడానికి కార్పొరేషన్‌కు అనుమతి మంజూరు చేశారన్నారు. 2019–24 మధ్య జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కార్పొరేషన్ల ద్వారా లక్షల కోట్లు అప్పులు తెచ్చారని, ఊరూరా తిరిగి తన ఎల్లో మీడియా ద్వారా చంద్రబాబు విష ప్రచారం చేయించారన్నారు. వారం రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ద్వారా 5 వేల కోట్లు అప్పు చేయాలని జీఓ నంబర్ 97 ద్వారా సంస్థకు అనుమతులు ఎలా జారీ చేశారని ప్రశ్నించారు. పేదవాడికి ఇచ్చిన హామీలను చంద్రబాబు ఒక్కటి కూడా నెరవేర్చకుండా.. ఈ డబ్బునంతా అమరావతిలో పెట్టి రియల్ ఎస్టేట్ సామ్రాజ్యాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు విజనరి అని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని నమ్మిన మేధావులు, విద్యావంతులు ఇప్పటికైనా మోసాన్ని గ్రహించాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఇంటెలెక్చువల్ విభాగం అధ్యక్షుడు కొప్పుల ఈశ్వరరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో పలాస విద్యార్థుల ప్రతిభ


స్కేటింగ్ విజేతలను అభినందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కృష్ణారావు

కాశీబుగ్గ: చిత్తూరు జిల్లా తిరుపతిలో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ 2024–25 పోటీల్లో పలాస–కాశీబుగ్గ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రిలే రేస్‌లో పి.రాఘవి స్వర్ణ పతకం, 200 మీటర్ల పోటీలో ఎ.అయాన్ రజతం, 1000, 200 మీటర్ల పోటీలో ఎస్.పార్థసాయి బ్రాంజ్ మెడల్ సాధించారు. వీరు తమిళనాడు రాష్ట్రం మధురైలో జరిగే సెలెక్టెడ్ నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు నిర్వాహకులు ప్రకటించారు. క్రీడాకారులను పలాస–కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బోర కృష్ణారావు, ప్రిన్సిపాల్ బోర శిరీష, ఉపాధ్యాయులు గురవారం అభినందించారు.

ఆ ఉద్యోగాలకు మళ్లీ నోటిఫికేషన్?


వర్సిటీ ముందు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 1వ తేదీ నుంచి 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తొలగింపునకు గురైన ఉద్యోగుల్లో కొందరు కూటమి నాయకులు చుట్టూ, మరికొందరు న్యాయ నిపుణుల చుట్టూ తిరుగుతున్నారు. మరో వైపు ఆయా ఉద్యోగాలకు కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేసి తమకు అనుకూలమైన వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు కొందరు వర్సిటీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. చట్టపరంగా నోటిఫికేషన్ ఇచ్చినా ఉద్యోగాలు మాత్రం కూటమి నాయకుల సిఫారసులు, తమకు నచ్చిన వారికే ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఉత్తమ మానవ వనరులను తీర్చిదిద్దాల్సిన విశ్వ విద్యాలయ అధికారులు ఇలా స్వార్థంతో వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఉన్నత విద్యాశాఖ అధికారులు సైతం ఇక్కడి అధికారుల వ్యవహార శైలిపై అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం.

5న హైందవ శంఖారావం


కరపత్రికను గాదె శ్రీనివాసులునాయుడు తదితరులు

రణస్థలం: విజయవాడలో ఈ నెల 5న జరిగే హైందవ శంఖారావం సభకు హిందువులంతా తరలిరావాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు రణస్థలం మండలం కోష్ట గ్రామంలో గురువారం కరపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల పరిరక్షణకు హిందువులంతా ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి బి.చిన్నంనాయుడు, ఆపస్ అధ్యక్షుడు జి. చిన్ని కృష్ణంనాయుడు, హైందవ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్


మహిళల ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజీ క్రీడాకారిణులు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం పరిధిలోని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన అంతర పాలిటెక్నిక్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. డిసెంబర్ 18న పోటీలు ప్రారంభం కాగా అదే నెల 20వ తేదీతో ముగియాల్సి ఉంది. అయితే వర్షం కారణంగా చివరి రోజు క్రీడలు, ముగింపు కార్యక్రమం వాయిదా పడింది. ఆ పోటీలను శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళలు కళాశాల, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వరా పాలిటెక్నిక్ కళాశాల మైదానాల్లో చివరి రోజు నిర్వహించి గురువారం సాయంత్రం శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మహిళలు విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని బి.సోనియా గెలుచుకుంది. బాలురు విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌గా శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి పి.శివరామకృష్ణ నిలిచారు. మహిళల విభాగంలో స్పోర్ట్సు చాంపియన్‌షిప్ అవార్డును శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల, పురుషుల విభాగంలో ఎచ్చెర్ల వెంకటేశ్వరా పాలిటెక్నిక్ కళాశాల సాధించాయి. గేమ్స్ చాంపియన్‌షిప్‌ను మహిళల విభాగంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల, పురుషుల విభాగంలో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను మహిళల విభాగంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, పురుషుల విభాగంలో ఎచ్చెర్ల వెంకటేశ్వరా పాలిటెక్నిక్ కళాశాల క్రీడాకారులు సాధించారు. విజేతలకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ప్రాంతీయ రవాణా అధికారి పి.వి.గంగాధరరావు, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్ టి.విక్టర్‌పాల్, విభాగాధిపతులు జి.దామోదర్‌రావు, డి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పురుషుల ఓవరాల్ చాంపియన్‌షిప్ అందుకుంటున్న వెంకటేశ్వరా పాలిటెక్నిక్ కళాశాల క్రీడాకారులు

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

గార: శ్రీకూర్మం పంచాయతీ కోరాడపేట సమీపంలో సముద్ర తీర ప్రాంతంలో 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని ఎస్ఐ ఆర్.జనార్దనరావు తెలిపారు. సారా తయారీ కోసం రెండు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో ఉన్న ఊటను గుర్తించామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

107 డీలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ


ఆర్డీఓ సాయిప్రత్యూష

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం రెవెన్యూ డివిజన ల్ పరిధిలో రేషన్ డిపోల డీలర్ పోస్టులకు దరఖాస్తు లు స్వీకరిస్తున్నట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయి ప్రత్యూష తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 107 పోస్టులకు ఈ నెల 2న నోటిఫికేషన్ జారీ చేశామని, జనవరి 23న సాయంత్రం 5 గంటల వరకు అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. హాల్ టిక్కెట్లు జనవరి 31న జారీ చేస్తామని, ఫిబ్రవరి 5న శ్రీకాకు ళం ఆర్ట్స్ కళాశాలలో రాత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఫిబ్రవరి 9న ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్మీడియె ట్ (పాస్/ఫెయిల్) కనీస విద్యార్హతగా నిర్ణయించా మని తెలిపారు. 18 నుంచి 40 ఏళ్ల వయసు కలిగి గ్రామ పంచాయతీ/మున్సిపాలిటీ పరిధిలోనే అభ్యర్థి నివాసం ఉండాలని పేర్కొన్నారు. మొత్తం 112 పోస్టులు ఖాళీ కాగా ఐదు చోట్ల కోర్టు కేసులు ఉన్నట్లు వివరించారు.

క్లాస్–4 ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆల్ ఆంధ్రప్రదేశ్ క్లాస్–4 ఎంప్లాయీస్ శ్రీకాకుళం జిల్లా క్యాలెండర్‌ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ గురువారం ఆవిష్కరించారు. జేసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సీహెచ్ ఉమాశంకర్, సెక్రటరీ ఏ.పద్మ, రవిశంకర్, సీతారాం, సుబ్రహ్మణ్యం, నాగమణి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే టూరిజంలో ప్రత్యేక ప్యాకేజీలు



ఆమదాలవలస: టూరిజంలో రైల్వేశాఖ ప్రత్యేక ప్యాకేజీలు కల్పిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం మానిటర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ వద్ద ప్రకటన విడుదల చేశారు. జనవరి 24 నుంచి 30 వరకు(ఆరు రాత్రులు, ఏడు పగలు) కేరళ రాష్ట్రంలోని కొచ్చి, డచ్ ప్యాలెస్, సెయింట్ ఫ్రాన్సిస్ చర్చి, సాంటర్ క్రాస్ బాసిలిక, మున్నార్, కొమరం, అలీఫ్, తెక్కడి పెరియర్ వన్యప్రాణుల అభయారణ్యం, త్రివేంద్రం పద్మనాభ స్వామి ఆలయం, అజీమల ఆలయం, కోవలం బీచ్ తదితర సుందర ప్రదేశాలు తిలకించవచ్చని, ఒక మనిషికి రూ.64,520, ఇద్దరూ అంతకంటే ఎక్కువ మందైతే చార్జీ తగ్గుతుందని వివరించారు. బయలుదేరినప్పటి నుంచి తిరిగి వచ్చే వరకు మొత్తం ఖర్చు టూరిజం శాఖ భరిస్తుందని తెలిపారు. ఫిబ్రవరి 12 నుంచి18 వరకు మ్యాజికల్ మేఘాలయ(ఆరు రాత్రులు, ఏడు పగలు) పేరిట మేఘాలయ, గౌహతి కామాఖ్య టెంపుల్, బాలాజీ టెంపుల్, చిరపుంజి జలపాతం, గుహలో, ఎలిఫెంటా జలపాతం, లివింగ్ రూట్ బిజీ డాకి సరస్సు, నేషనల్ పార్కు తదితర ప్రదేశాలను చూపిస్తామని వివరించారు. ఎయిర్ ప్యాకేజీ విశాఖపట్నం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ఏడు రోజుల టూర్‌కు రూ.63,635 చార్జీగా నిర్ణయించామన్నారు. పూర్తి వివరాలకు చందన్ కుమార్ (928103074, 9550166168, 9281495847)ను సంప్రదించాలని కోరారు

పాఠశాలలను బలోపేతం చేద్దాం

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల సమగ్రాభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ సంపతిరావు శశిభూషణ్ కోరారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఇటీవల ఎన్నికైన స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్, కన్వీనర్లతో గురువారం శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ రోడ్‌లో ఉన్న భారతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల బలోపేతంతో స్కూల్ యాజమాన్య కమిటీలే కీలకంగా మారబోతున్నాయని చెప్పారు. పాఠశాల పరిసరాలలో డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాలు సేవించే పరిస్థితులు ఏర్పడుతున్నందున వాటి నిర్మూలనకు కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ ఎస్.శశిభూషణ్